సన్మానం



నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పశు వైద్య శస్త్రచికిత్సకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్‌ను నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులో ఉన్న పశువైద్య కార్యాలయంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మహేశ్వరుడు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయప్రకాష్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా అభినందించారు.

వేడుకగా అన్నమాచార్యుల సంకీర్తనావళి



అన్నమాచార్య సంకీర్తనావళి కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు



పాల్గొన్న అతిథులు

నెల్లూరు(బృందావనం): శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ, శ్రీవాణి శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనావళి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మినీబైపాస్‌రోడ్డులోని పీవీఆర్ కల్యాణ మండపంలో అన్నమయ్య సంకీర్తనావళి ఆద్యంతం భక్తిరస రంజకంగా సాగింది. ఈ సందర్భంగా శ్వేత మాజీ సంచాలకులు, ప్రముఖ సాహితీవేత్త భూమన్ అన్నమాచార్యుల కీర్తనల భావాన్ని వ్యక్తీకరించగా, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు కె.సరస్వతీప్రసాదు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ఈ కీర్తనలకు నెల్లూరు శ్రీగురుకృప కళాక్షేత్రానికి చెందిన విద్యార్థినులు నాట్యార్చన చేశారు. తొలుత మినీబైపాస్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం కళాకారుల ఆధ్వర్యంలో అన్నమయ్య సర్కిల్ నుంచి పీవీఆర్ కల్యాణ మండపం వరకు అన్నమాచార్య నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త భూమన్ మాట్లాడుతూ తన సంకీర్తనల ద్వారా సమాజంలోని అసమానతలను రూపుమాపుతూ అటు ఆధ్యాత్మిక చింతన, ఇటు సామాజిక, సాహితీ చైతన్యానికి బాటలు వేసిన ప్రజాకవి అన్నమయ్య అని కొనియాడారు. శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ముఖ్యసమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు వీరిశెట్టి హజరత్‌బాబు, కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ కె.కృష్ణకిషోర్, సీహెచ్ పెంచలరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, దండమూడి హేమంత్‌కుమార్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, వట్టిగుంట చంద్రయ్యచౌదరి, ముడి శోభన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీనగర్ ఊగా దిసెంటర్ పాత రైసుమిల్లు ప్రాంగణంలో శనివారం రాత్రి శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణోత్సవాన్ని వీక్షించారు.

మట్టి మాఫియా డాన్ సోమిరెడ్డే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

నెల్లూరు(దర్గామిట్ట): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మట్టి మాఫియా డాన్‌గా అధికార పక్షంలో చేసిన దోపిడీ చాలక ప్రతిపక్షంలో కూడా ప్రజల కళ్లు గప్పి దోపిడీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆరోపించారు. శనివారం నగరంలోని మాగుంటలేఅవట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమిరెడ్డి బినామీ బుచ్చినాయుడు టిప్పర్ వెంకటాచలం సమీపంలో జరిగిన ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగిని బలి తీసుకుందని, ఈ నేపథ్యంలో వాస్తవాలను పక్కదారి పట్టించి లేనిపోని మాటలు మాట్లాడుతున్నారన్నారు. కనుపూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలించే క్రమంలో టిప్పర్ ప్రమాదం జరిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ ఘటనతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టి మళ్లీ తొలగించడం వాస్తవం కాదా అన్నారు. చిన్న ఘటనలకే కలెక్టర్, ఎస్పీలను కలిసే సోమిరెడ్డి ఈ ప్రమాదంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సోమిరెడ్డి వెంటనే స్పందించి వాస్తవాలు వెల్లడించాలన్నారు. సోమిరెడ్డి తన బినామీని హైదరాబాదులో దాచింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కనుపూరు చెరువులో అక్రమ గ్రావెల్ రవాణాలో 10 వేల ట్రిప్పులు రవాణా చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని, తద్వారా 2 లక్షల క్యూబిక్ మీటర్ల చెరువు మట్టిని అక్రమంగా తరలించారని తెలిపారు. సోమిరెడ్డి ధనదాహానికి చనిపోయిన వారికి న్యాయం జరగాలంటే సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నన్నేకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, తోటపల్లి గూడూరు మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు బియ్యం బస్తాల వితరణ



నెల్లూరు రూరల్ : నెల్లూరు రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరు నక్కలకాలనీలో ఉన్న ఆస్థాన వృద్ధుల ఆశ్రమం, పొదలకూరు రోడ్డులోని హరిత వృద్ధాశ్రమానికి శనివారం దాతలు బియ్యం బస్తాలను వితరణగా అందజేశారు. నగరంలోని డైకస్ రోడ్డు ప్రాంతానికి చెందిన యలమందరావు వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి యశోద, కుటుంబసభ్యులు సహకారంతో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బియ్యం బస్తాలను వృద్ధాశ్రమాలకు అందజేశారు. కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు షేక్ రసూల్, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రాజేశ్వరి, నారాయణ పాల్గొన్నారు.

మహిళా విభాగం అధ్యక్షురాలి ఎన్నిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాలమహానాడు మహిళా విభాగం నెల్లూరు నగర అధ్యక్షురాలిగా చినకోట ఉషారాణి ఎన్నికయ్యారు. నగరంలోని అంబేడ్కర్‌భవన్‌లో మాలమహానాడు మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉషారాణిని ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు కాయల మేరి ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణకృపాకర్, నగర అధ్యక్షుడు అశోక్, శైలేంద్రబాబు, శంకరమ్మ, ప్రియాంక, రత్నమ్మ పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు ఆపన్నహస్తం



నెల్లూరు(బృందావనం): ఎనిమిది పదులు నిండిన నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధ దంపతులకు దాతలు సాయం అందించి ఆదుకున్నారు. వెంకటాచలం ప్రాంతంలో బిక్షాటన చేసుకుని జీవించే వృద్ధ దంపతులు ఆ ప్రాంతంలో జరుగుతున్న రైల్వే పనుల కారణంగా గత కొన్ని రోజులుగా నెల్లూరులోని భక్తవత్సలనగర్ రైల్వే గేట్ వద్ద బిక్షాటన చేస్తూ బతుకువెళ్లదీస్తున్నారు. వారి పరిస్థితిని చూసి చలించిన కళాకారుడు, కార్పెంటర్ ఎం.శ్రీనివాసులు తన మిత్రులు శివాజీ, బాషాలతో కలిసి వారికి అవసరమైన దుస్తులు, పండ్లు, తినుబండారాలతోపాటు కాస్మోటిక్స్ శనివారం అందజేసి మానవత్వం చాటుకున్నారు.

అన్నదానం



నెల్లూరు(బృందావనం): గ్రంథాలయ సిద్ధాంత కర్త ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కు వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, కృష్ణ కల్చరల్ ట్రస్ట్ అధ్యక్షుడు బి.కృష్ణ, అసోసియేషన్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, అళహరి వెంకటేష్, షేక్ కాలేషా, పెంచలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలు ప్రారంభం



హాజరైన అతిథులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్త్రీ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని కొండాయపాళెం ఇన్‌ఫాంట్ జీసెస్ పాఠశాల ప్రాంగణంలో జరిగిన ప్రారంభోత్సవంలో అసోసియేషన్ చైర్మన్ ఆనం రంగమయూర్‌రెడ్డి మాట్లాడుతూ జూడో క్రీడకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆనం రామ్‌కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలకు 350 మంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ జూడో అసోసియేషన్ కోశాధికారి కైలాస్‌యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు, సీఈఓ కేఎస్ బాబు, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర కోశాధికారి కిరణ్‌కుమార్, అబ్జర్వర్ ఉమేష్‌కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి శ్రావణమాస పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని సుజాతమ్మకాలనీలో ఉన్న అవధూత దత్తపీఠశాఖ శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి మందిరంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణ మాస పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయకుమార్ తెలిపారు. ఆ మందిర ప్రాంగణంలో శ్రావణమాస పూజల ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ప్రతి శ్రావణ శుక్రవారం ఉదయం నుంచి శ్రీస్వర్ణమహాలక్ష్మి మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తికి క్షీరాభిషేకం, శ్రీచక్రార్చన, ప్రత్యేక పూజలు, రాత్రి పల్లకి సేవ, నిర్వహిస్తారని తెలిపారు. అలాగే సామూహిక వరలక్ష్మీవ్రతం, శ్రీస్వర్ణ మహాలక్ష్మికి సహస్ర కలువలతో అర్చన, ధనలక్ష్మి కుబేర హోమం, చండీహోమం, ధనలక్ష్మీకుబేర పూజలు జరుగుతాయని తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 31వ తేదీ ఉదయం శ్రీకృష్ణునికి పుష్పాభిషేకం, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమం జరుగుతాయని తెలిపారు. సెప్టెంబర్ 15న శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పూజలో భక్తులు పాల్గొని సకల దేవతల అనుగ్రహం పొందాలని తెలిపారు. సమావేశంలో ట్రస్టీలు అనపల్లి మస్తాన్‌రెడ్డి, కె.సురేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆక్వారంగానికి తోడ్పాటు అభినందనీయం



నెల్లూరు రూరల్ : రాష్ట్రంలో ఆక్వారంగం అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తోడ్పాటును అందించడం అభినందనీయమని ష్రింప్ హేచరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాగర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న బీఎంఆర్ హేచరీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2005లో కోస్టల్ ఆక్వా కల్చర్ చట్టప్రకారం పలు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుండేదన్నారు. దీంతో ఆక్వా కల్చర్ అభివృద్ధి కుంటుపడుతుండేదని, ప్రస్తుతం లోపాలను సవరిస్తూ చట్ట సభల్లో బిల్లు ప్రవేశపెట్టడం ఆక్వా కల్చర్ అభివృద్ధి దోహదపడుతుందన్నారు. కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఈ బిల్లు ప్రవేశపెట్టడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని తెలిపారు. వీరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, కేంద్ర మత్స్యశాఖ అధికారుల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు విజయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అమరా శ్రీధర్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.